www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 25 ఏప్రిల్ 2025
5
చిత్తూరు



నేడు ఎమ్మెల్యే కార్యాలయంలో వినతుల స్వీకరణ



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం లక్ష్మీ నగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 25వ తేదీ శుక్రవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరణ జరుగుతుందన్నారు. ప్రజలు ఫిర్యాదులతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాన్ని జతచేయాలన్నారు. ఈకార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలని తెలిపారు.

చింతపండు.. ఉపాధి మెండు

- 10 వేల మందికి ఉపాధి
- చింతపండు ధరకు రెక్కలు
- ఆందోళనలో వ్యాపారులు



రాష్ట్రంలోనే చింత పండుకు పుంగనూరు ప్రసిద్ధి. సుమారు 60ఏళ్ల తరబడి పుంగనూరు నియోజకవర్గంలో పది వేల మంది చింత కాయను పండుగా తయారు చేసి, జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో గతంలో చింతచెట్లు విరివిగా ఉండేవి. జనవరి మాసం నుంచి మార్చి నెలాఖరు వరకు చెట్లలో ఉన్న కాయలు రాల్చడం, వాటిని ఒబ్బిడి చేసి, కట్టికాయగా మార్చడంలో పురుషులు ఎక్కువగా ఉపాధి పొందుతున్నారు.

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరులో కొన్ని ప్రాంతాలలో యజమానులు మండలు ఏర్పాటు చేసి, చింతపండును కొట్టించేవారు. కాలక్రమేణ చింతచెట్లు తగ్గి, దిగుబడి తగ్గుముఖం పట్టింది. అయినా నేటికి చింత పండు వ్యాపారం అధికంగా కొనసాగుతూనే ఉంది. వ్యాపారుల్తో పుంగనూరుకు ఇతర వ్యాపారస్తులు కర్ణాటక రాష్ట్రంలోని గుండ్లుపేట, మాండ్యా, చింతామణి, శ్రీనివాసపురం, సిరా, మహారాష్ట్రలోని ఔరంగాబాద్, నిజామాబాద్, బీహార్లోని రాంచి, జగదల్పూర్, రాయపూర్, తదితర ప్రాంతాల నుంచి సుమారు 25వేల టన్నుల చింతకాయ (కట్టికాయ) దిగుబడి చేస్తారు. వాటిని పండుగా తయారు చేసేందుకు స్థానిక ప్రజల ఇక్కడ తరలిస్తారు. ఈ పండు తయారీలో సుమారు 10 వేల మందికి పైగా మహిళలు ఉపాధి పొందుతున్నారు. సంవత్సరాంతం దిగుబడి చేసుకున్న చింతకాయ పట్టణంలోని ఏసీ గోడౌన్లలో నిల్వ ఉంచి, కాయను పండుగా తయారు చేసి, మద్రాస్, చెన్నై, ప్రొద్దుటూరు, విజయవాడ, హైదరాబాదు, మంగుళూరుకు తరలిస్తారు.

జూన్ మాసం నుంచి అమ్మకాలకు సిద్ధం చేస్తారు. చింత పండును చపాతీలుగా, బిస్కెట్ అనేక విధాలుగా తయారీకి 20 కేజీల కాయను సుమారు 25 చపాతీలు, 20 కేజీల పండుకు 40 అరకిలో బిస్కెట్ పేరుతో ప్యాకెట్లు తయారీ అవుతాయి. ఈ తయారీలో అధికంగా పుంగనూరులోని ఎన్.ఎస్.పేట, బీడీకాలనీ, ఉబేదుల్లా కాంపౌండ్, కమ్మరవీధి, భగత్‌సింగ్ కాలనీ, ప్రకాశం కాలనీ, చింతలవీధి, మేలుపట్ల, గాంధీనగర్, తదితర ప్రాంతాలలో మహిళలు ఇంటి వద్దనే ఉంటూ చింతపండు ద్వారా ఉపాధి పొందుతూ ఈ వృత్తినే ఎంచుకుని జీవనం సాగిస్తున్నారు. కుటుంబాల వారి దినసరి 50 నుంచి 100 చపాతీలు తయారు చేస్తారు. కాయను కొట్టి, పండుగా తయారు చేసే చపాతీలు తయారు చేస్తే ఒక్కో చపాతికి రూ.4లు చొప్పున కూలీ చెల్లిస్తారు. అలాగే పండును ప్లాస్టిక్ కవర్లలో, బిస్కెట్ అరకిలో ప్యాకెట్లలో వేసి ప్యాకింగ్ చేస్తే ఒక్కో ప్యాకెట్‌కు రూ 3లు కూలీ చెల్లిస్తారు. ఈ విధంగా ఒక్కొక్కరు రోజుకు 80 ప్యాకెట్లు తయారు చేస్తారు. వయసును బట్టి ఈ పనిని ఎంచుకుని కుటుంబం వారు పండును వ్యాపారస్తులు కోరిన రీతిలో తయారు చేస్తారు. సుమారు 300 మందికి పైగా వ్యాపారస్తులు ఇండ్ల వద్దకే చింతకాయలు తరలించి, తిరిగి వారి వద్ద నుంచి తెప్పించుకుంటారు. కాలక్రమేణ వర్షాలు సకాలంలో పడక, వ్యవసాయం, తదితర పనులకు కూలీలు బయటకు వెళ్లలేక మహిళలు ఈ చింత పండు తయారీలో వర్షాలు లేని సంవత్సరాంతం ఉపాధి పొందుతున్నారు. పట్టణంలో పలు చోట్ల మండిలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారుల వద్దకు ఇళ్ల వద్ద సౌకర్యం లేని వారు అక్కడికి వెళ్లి చింతపండు ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. కూలీలకు గిట్టుబాటు ధరల కోసం రోడ్లపై ధర్నా, రాస్తారోకోలు చేసినా వారికి గిట్టుబాటు ధరలు మాత్రం లభించకపోవడంతో శోచనీయం.





రేట్లు పెరిగినా వ్యాపారులకు తప్పని 'చింత'

గత ఐదు సంవత్సరాలలో పోల్చుకుంటే ఈ ఏడాది సీజన్లో చింతపండు ధరలు మాత్రం అధికంగా ఉన్నాయి. వ్యాపారులు కొనుగోలు చేసిన తర్వాత చింతపండు ధర ఎక్కడ తగ్గుతుందని వ్యాపారస్తుల్లో 'చింత' వెంటాడుతుంది. ప్రతి ఏడాది ఫిబ్రవరి రెండో వారం చింతపండు వ్యాపార సీజన్ ప్రారంభమై మే ఆఖరి వారం ముగుస్తుంది. అంతలోపు వ్యాపారులు స్థానికంగా ఉన్న చింత పండు, ఇతర ప్రాంతాల నుండి చింతపండు తీసుకొచ్చి శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తారు. లోకల్లో ఉన్న కట్టికాయ రూ.40 నుంచి 45లు ధర పలుకుతున్నది. మహారాష్ట్ర కట్టికాయ రూ.60 నుంచి 70 రూపాయల వరకు ధర పలుకుతుంది. ఫ్లవర్ చింతపండు కేజీ ధర 75 నుంచి 135లు, చపాతి రూ.120 నుంచి 150లు, కరుపులి రూ.150 నుంచి 250లు వరకు ప్రస్తుతం ధరలు ఉన్నాయి. ఈ ధరలు ఇలాగే కొనసాగవచ్చు లేక తగ్గే ఆకాశం కూడా ఉండవచ్చునని వ్యాపారులు చెబుతున్నారు. దిగుబడి తక్కువగా ఉండడంతో ఈఏడాది వ్యాపారాలు కూడా తక్కువగా ఉంటాయని వ్యాపారస్తులు చెబుతున్నారు.

25 బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు

రహదారి భద్రతా నియమాలు పాటించండి
ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

రహదారి భద్రతా నియమాలు పాటించి ప్రజలు తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లా పరిధిలో గల రహదారులపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న 25 ప్రదేశాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించడం జరిగిందన్నారు. ఎన్‌హెచ్ 69 పైబ్లాక్ స్పాట్‌ల వివరాలు ఇలా ఉన్నాయి. ఎంఎస్‌ఆర్ క్రాస్, చీలపల్లి క్రాస్, ఆర్ఎం ఫ్యాక్టరీ గంగసారం, యాదమరి జంక్షన్, వారిగపల్లి జంక్షన్, కెజి సత్రం, మొగిలి ఘాట్ (నియర్ శ్రీనివాస ఫుడ్ ఫ్యాక్టరీ), దొర చెరువు (మొగిలి ఘాట్), జగమర్ల క్రాస్, దండపల్లి (విఎస్‌ఆర్) జంక్షన్, పొన్నమాకులపల్లి క్రాస్, అలకుప్పం (కుక్కలదొడ్డి క్రాస్) ఉన్నాయి. అలాగే ఎస్‌హెచ్ 42పై బ్లాక్ స్పాట్లు గొల్లపల్లి క్రాస్, దేవదొడ్డి, కుమ్మరమడుగు క్రాస్, జువనిపల్లి క్రాస్, నాయనపల్లి పెట్రోల్ బంక్, విజలపురం క్రాస్, కెసి.హాస్పిటల్ అలాగే ఎస్‌హెచ్ 40పై మురకంబట్టు జంక్షన్‌ను గుర్తించారు. ఎన్‌హెచ్ 140 పై తెల్లగుండ్లపల్లి క్రాస్, పి.కొత్తకోట రైల్వే అండర్ బ్రిడ్జి, ఎన్‌హెచ్ 716పై హెచ్‌పి పెట్రోల్ బంక్, గవర్నమెంట్ ఆసుపత్రి ఎదురుగా, కన్నం మిట్ట ప్రదేశాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించడం జరిగిందన్నారు. ప్రజలు పైన తెలిపిన బ్లాక్ స్పాట్‌లను గమనించి రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఈ 25 బ్లాక్ స్పాట్స్‌లో 2024 సంవత్సరానికి సంబంధించి 249 లైట్ వెయిట్ వాహనాల ప్రమాదాలు, 209 ద్విచక్ర వాహనాల ప్రమాదాలు సంభవించగా 510 మంది గాయపడ్డారని, 228 మంది మరణించారని అందులో అత్యధికంగా ద్విచక్ర వాహనాల ప్రమాదంలో 128 మరణించారని తెలిపారు. రోడ్డు భద్రతకు సంబంధించి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నామని, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు ఇది వరకే పలుమార్లు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వారి పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందన్నారు.



సురక్షిత డ్రైవింగ్ కోసం

వేగపరిమితిని పాటించండి, ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సంకేతాలను పాటించండి, వాహనంలో ప్రయాణిస్తున్నప్పుడు సీట్ బెల్ట్ ధరించాలి. డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ మాట్లాడకండి. మద్యం, మత్తు పదార్థాలు ఉపయోగించకండి. ముందు ఉన్న వాహనంతో సరైన దూరం పాటించండి.

పద్మశ్రీ బండి రామకృష్ణారెడ్డి కన్నుమూత

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ప్రఖ్యాత భాషా శాస్త్రవేత్త పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆచార్య బండి రామకృష్ణారెడ్డి (84) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆయన చికిత్స తీసుకుంటున్నారు. గత రాత్రి హైదరాబాదు డిఆర్‌డిఏ సమీపంలోని అపోలో ఆసుపత్రిలో కన్నుమూసినట్టు ఆయన మేనల్లుడు యోగి వేమన విశ్వవిద్యాలయ తెలుగు ఆచార్యులు డాక్టర్ ఎన్.ఈశ్వరరెడ్డి గురువారం తెలిపారు. బండి రామకృష్ణారెడ్డి చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం, రెంటాలచేను గ్రామంలో జన్మించారు. ఉన్నత చదువులు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎంఏ హిందీ, పూణెలోని డెక్కన్ కాలేజీలో ఎంఏ భాషాశాస్త్రం చదివారు. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలు అన్నామలై విశ్వవిద్యాలయం , సీఐఐఎల్ మైసూర్‌లో పనిచేశారు. ఆ తర్వాత కామన్వెల్త్ ఫెలోషిప్ పై యూకే వెళ్లి ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో ఆండర్సన్ కేస్ గ్రామర్‌పై పీహెచ్‌డీ పట్టా సాధించారు. 1977లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని భాషాశాస్త్ర విభాగంలో లెక్చరర్‌గా చేరి, తర్వాత ప్రొఫెసర్ అయ్యారు. 1990లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా చేరి అక్కడే భాషాభివృద్ధి పీఠానికి పీఠాధిపతిగా విధులు నిర్వర్తించారు. తదనంతరం అదే విశ్వవిద్యాలయానికి రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ఆ తర్వాత కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయానికి వ్యవస్థాపక రిజిస్ట్రార్‌గా అమూల్య సేవలందించారు. ప్రొఫెసర్ రెడ్డి అనేక గిరిజన భాషలపై పనిచేసి, భారత ప్రభుత్వం నుండి ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన ఇంది- ఆవే భాషకు లిపి తయారు చేశారు. ఆయన తన వృత్తి జీవితంలో ద్రావిడ భాషావేత్తల సంఘం (డీఎల్ఏ)తో చురుకుగా సంబంధం కలిగి అనేక పరిశోధన పత్రాలను ప్రచురించారు. విద్యార్థులకు స్నేహపూర్వకంగా ఉంటూ, పేదవిద్యార్థులకు ఆర్థికంగా సహాయం చేశారు. గురువారం వారి స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తయ్యాయి.



పద్మశ్రీ బండి రామకృష్ణారెడ్డి (ఫైల్‌ఫోటో)

అపోలో నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అపోలో వైద్యుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైపోయిందని బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల కన్వీనర్, మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ షణ్ముగం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి అపోలో లీజును రద్దు చేయాలని కోరుతూ ప్రజాఉద్యమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. గురువారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షణ్ముగం మాట్లాడుతూ తన కుమార్తె శ్రీదుర్గా తెలుగుదేశం మహిళా విభాగంలో కీలక నాయకురాలుగా వ్యవహరిస్తోందని, ఆమె బుధవారం మెకానికల్ క్రీడా మైదానం వద్ద రోడ్డు ప్రమాదానికి గురైందని తెలిపారు. హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యచికిత్సలు చేసి ఎలాంటి ప్రమాదం లేదంటూ అపోలో వైద్యులు ఇంటికి పంపేశారని తాము పదేపదే అందుబాటులో ఉన్న సిటి స్కానింగ్, ఎమ్మారై స్కానింగ్ చేయాలని కోరినా ఎలాంటి ప్రమాదం లేదంటూ ఇంటికి పంపేశారని, ఇంటికి వచ్చాక అపస్మారక స్థితికి గురికావడంతో తిరిగి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లే మార్గమధ్యంలో మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. తలకు తగిలిన గాయం వల్లే ఆమె మృతి చెందినట్లు అపోలో వైద్యులు శ్రీదుర్గా మృతి తరువాత చెప్పడం అత్యంత విచారకరమని వాపోయారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అపోలో వైద్య సంస్థ శిక్షణలో ఉన్న వైద్యులు మినహా సీనియర్ వైద్యులు లేరని నిర్వాహకులు నరేష్ కుమార్ రెడ్డి ఆసుపత్రిలో ఆధిపత్యాన్ని నడుపుతూ ప్రభుత్వ వైద్యులను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తన కుమార్తె శ్రీదుర్గా అపోలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ప్రాణాలు కోల్పోయిందని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని అపోలో లీజును రద్దు చేయాలంటూ ప్రజాఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.



తన కుమార్తె మృతికి అపోలో వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ రోధిస్తున్న షణ్ముగం

టిడిపి మహిళా నేత మృతికి నివాళి

తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంటరీ మహిళా కార్యదర్శి డి.శ్రీదుర్గ మృతికి తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, ఆయన తండ్రి గురజాల చెన్నకేశవ నాయుడు, ఎమ్మెల్యే సతీమణి ప్రతిమ, గురజాల జీవన్, మేయర్ ఎస్.అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి సంతపేటలోని ఆమె నివాసానికి వెళ్లి మృతదేహానికి పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు.

ఉగ్రదాడి ఘటన కలచివేసింది: ఎంపీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడి ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. జమ్మూకాశ్మీర్ పహల్గామ్ ప్రాంతంలో ట్రెక్కింగ్‌లో ఉన్న పర్యాటకులపై ఉగ్రమూకలు దాడి చేసిన ఘటన కాశ్మీర్‌నే గాక దేశాన్నే కుదిపేయడంపై గురువారం ఓ ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టూరిస్టుల పై జరిగిన ఉగ్రదాడి పిరికిపందల చర్య ఆయన ఖండించారు. అలాగే కాశ్మీర్లో జరిగిన ఉగ్రవాదుల దాడుల్లో తూటాలకు బలైన వారికి సిపిఐ, ఏఐటియుసి, ముస్లిం ఐక్యవేదిక మహిళా సమైక్య ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, మణి, దాసరి చంద్ర, రమాదేవి, విజయ్ కుమార్, ముస్లిం ఐక్య వేదిక నాయకులు రషీద్, చౌకత్ బాషా పాల్గొన్నారు.



గురుకులం ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి: డీఆర్‌ఓ



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న డిఆర్‌ఓ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో ఏప్రిల్ 25వ తేదీ శుక్రవారం జరగనున్న ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజ్ ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయంలోని డిఆర్‌ఓ ఛాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజ్ ప్రవేశ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై విద్యాశాఖ అధికారులతో డిఆర్‌ఓ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ ఏప్రిల్ 25న ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజ్‌లో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాలో పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేసామని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జూనియర్ కాలేజీ ప్రవేశ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలకు సంబంధించి జిల్లా కేంద్రంలో విజయం డిగ్రీ కళాశాల, నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కేశవరెడ్డి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, క్యాంఫర్డ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ పరీక్షలకు 756 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. జూనియర్ కళాశాల ప్రవేశ పరీక్షలకు సంబంధించి జిల్లా కేంద్రంలో విజయం డిగ్రీ కళాశాల, నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, కేశవరెడ్డి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, క్యాంఫర్డ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, గ్రీమ్స్ పేట్ మునిసిపల్ హైస్కూల్‌లో పరీక్షలు జరుగుతాయని, ఈ పరీక్షలకు 1082 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్లను నియమించడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు, ఓఆర్ఎస్ పాకెట్లు, ప్రథమ చికిత్స ఏర్పాట్లు, పోలీస్ బందోబస్త్, తదితర ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ షాప్ లు మూసి వేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి డీఈఓ వరలక్ష్మి, జిల్లా కాలేజీ ఆర్డినేటర్ భార్గవి, అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ ఓ భరోసా : ఎస్పీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: హెల్మెట్ ధారణ అవగాహనను పెంపొందించే ఉద్దేశంతో రూపొందించిన ప్రత్యేక పాటను గురువారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు జిల్లా పోలీసు అధికారుల సమక్షంలో పట్టణంలోని గాంధీ కూడలి వద్ద ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు ఎలా రక్షించబడతాయో, ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను తప్పనిసరిగా ఎలా ఉపయోగించాలో ఈ పాట ద్వారా ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేకంగా ఈ పాటను రూపొందించామని, తెలిపారు. సాధారణ ప్రజల నుంచి విద్యార్థులు, యువత వరకు అందరికీ చేరువయ్యేలా, సందేశాత్మకంగా రూపొందించడం విశేషమన్నారు. పాటను రూపొందించడంలో ప్రత్యేక పాత్ర పోషించిన ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబును అభినందించారు. అనంతరం జిల్లా ఎస్పీ జెండా ఊపి బైక్ ర్యాలిని ప్రారంభించారు. గాంధీ కూడలి వద్ద ప్రారంభమైన ర్యాలీ మూడు బృందాలుగా మురకంబట్టు జంక్షన్ వైపు, రెడ్డిగుంట జంక్షన్ వైపు, సాంబయ్య కండ్రిగ వైపు ర్యాలీగా వెళ్లి తిరిగి గాంధీ కూడలి వద్దకు చేరుకున్నారు.

'గోకులం' నిర్మాణంలో జిల్లా ఫస్ట్

- **1,393 షెడ్ల నిర్మాణాలు పూర్తి**

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు జిల్లా పేరు వినగానే గుర్తొచ్చేది పాడి పరిశ్రమ, మామిడి రైతులు. చిత్తూరు జిల్లాలో రోజుకు 18 లక్షల నుండి 20 లక్షల లీటర్ల పాల సేకరణ జరుగుతోంది. జిల్లాలో 80 శాతం మంది రైతాంగం వ్యవసాయానికి అనుబంధంగా పాడి పోషణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వ్యవసాయంలో ఎదురయ్యే నష్టాలను పాడి ఆవుల పెంపకం ద్వారా తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ దశలో రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు తోడ్పాటున అందించేలా గోకులం షెడ్ల నిర్మాణాన్ని చేపట్టింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశు వుల షెడ్లను పెద్ద ఎత్తున చేపట్టింది. గోకులం షెడ్ల నిర్మాణంలో రాష్ట్రంలోనే చిత్తూరు జిలా 1,393 షెడ్లు పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. చిత్తూరు జిల్లాకు 2,173 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. అందులో 2,094 పురోగతిలో ఉన్నాయి. 1,393 పూర్తయ్యాయి.



నియోజకవర్గాల వారీగా గోకులం షెడ్ల నిర్మాణాల వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు నియోజకవర్గం మంజూరైన షెడ్లు 132 పురోగతిలో ఉన్నవి 131, పూర్తయినవి 82. జీడి నెల్లూరు మంజూరు 238, పురోగతి 225 పూర్తయినవి 164. కుప్పం మంజూరైనవి 466, పురోగతి 457, పూర్తయినవి 20097 నగిరి మంజూరైనవి 153, పురోగతి 139 ,పూర్తి అయినవి 105 పలమనేరు మంజూరు 437, పురోగతి 427 , పూర్తి 245 పుంగనూరు మంజూరు 359 , పురోగతి 337 ,పూర్తి 237 పూతలపట్టు మంజూరు 388, పురోగతి 378, పూర్తి 263.


గోకులం షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వ ప్రోత్సాహం

గోకులం షెడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలతోపాటు ఐదు ఎకరాలు భూమి కలిగిన చిన్న, సన్నకారు రైతులకు ప్రోత్సాహాన్ని అందిస్తోంది 50 సెంట్లు కూలి 15,000 మెటీరియల్ ఖర్చు 17,92. 40 సెంట్లు గాను కూలి 12,000 మెటీరియల్ 14,394. 30 సెంట్లు గాను కూలి 9,000 మెటీరియల్ 10,795 20 సెంట్లు గాను కూలి 6,000 మెటీరియల్ 7,197 10 సెంటలకు గాను కూలి 3,000 మెటీరియల్ 3,599 రూపాయలు అందిస్తోంది. మొత్తంగా చూస్తే 50 సెంట్లు 32,992, 40 సెంటలకు 26,394. 30 సెంట్లు 19,795 .20 సెంట్లు 13,197. 10 సెంట్లు 6,599 ప్రభుత్వం గోకుల షెడ్ల నిర్మాణానికి అందజేస్తోంది.


గోకులం షెడ్డు నిర్మాణం కోసం అప్లికేషన్ జాబ్ కార్డు పొలం వన్ బి జిరాక్స్ ఆధార్ కార్డు జిరాక్స్ బ్యాంక్ పాస్బుక్ జిరాక్స్ రేషన్ కార్డు జిరాక్స్‌ను అందించాలి. పరిశుభ్రత పశువుల ఆరోగ్యానికి అధిక ఉత్పాదకత సాధించవచ్చని ప్రభుత్వం చెబుతోంది ఎండ వానాల నుండి పశువులకు రక్షణ కలుగుతోంది. లబ్ధిదారులకు 90శాతం రాయితీపై గ్రామీణ ఉపాధి హామీ పథకంతో గోకులం షెడ్ల నిర్మాణాన్ని చేపడుతోంది. ఎస్సీ ఎస్టీ తెగలకు చెందిన పసుపు పోషకులకు ప్రాధాన్యత ఇస్తోంది. శాస్త్రీయ పశు యాజమాన్యానికి ఇది దోహదం చేస్తుందని సూచిస్తోంది.

ఎంతగానో తోడ్పడుతుంది
- అంజప్ప, రామకుప్పం

రామకుప్పం మండలం పెద్దూరు పంచాయతీ ననియాల గ్రామానికి చెందిన అంజప్ప తనకు మూడు ఎకరాల పొలం ఉంది. నాలుగు పెద్ద ఆవులు రెండు దూడలతో పాడి పోషణ ద్వారా రోజుకు 18 నుండి 20 లీటర్ల పాలని ఉత్పత్తి చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో 22 ఎంతో 22ఐ15 విస్తీర్ణంతో పశువుల షెడ్డుని నిర్మించుకున్నానని ప్రస్తుతం ఆవులు దూడలు షెడ్డు నీడలో ఉంటున్నాయని తెలిపారు.




పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- సుమిత్ కుమార్, జిల్లా కలెక్టర్



రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు ఆసరాగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద గోకులం షెడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం ఇచ్చింది. పాడి రైతులు అందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రైతులు సంక్షేమంలో భాగంగా షెడ్ల నిర్మాణంతోపాటు షెడ్లలో పశువులు సేదతీరేలా అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయడం ద్వారా పాల ఉత్పత్తి మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

పాడి రైతులకు అండ
- వెంకటేష్, రైతు, జిడి నెల్లూరు

గంగాధర నెల్లూరు మండలం మిట్ట కొత్తూరు గ్రామానికి చెందిన పాడి రైతు వెంకటేష్ నాయుడు గోకులం షెడ్డు నిర్మాణాలపై తన స్పందన తెలియజేశారు. పాడిపశువుల పెంపకానికి అధిక ప్రాధాన్య తీస్తూ పాడి రైతుకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉపాధి హామీ కింద నిధులు మంజూరు చేసి షెడ్లు నిర్మాణానికి తోడ్పాటును అందించి పాడి రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది.



గుణశేఖరన్‌కు ఘనంగా వీడ్కోలు



గుణశేఖర్‌ను సన్మానిస్తున్న ఎంఈవో

ప్రజాశక్తి- యాదమరి: ఉపాధ్యాయులుగా 42 సంవత్సరాలుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న ఎస్‌టియు మండల శాఖ అధ్యక్షులు గుణశేఖరన్‌కు ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సన్మానించారు. పాచిగుంట పాఠశాలలో గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు రుక్మణమ్మ, హెచ్‌ఎల్‌ఎన్ అధ్యక్షతన వహించారు. ఎంఈఓ రుక్మణమ్మ మాట్లాడుతూ 42 సంవత్సరాలుగా ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, సమయపాలన, క్రమశిక్షణతో వ్యవహరించి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారని, ఎంతోమంది విద్యార్థులకు భవిష్యత్తు బాటలు చూపారని, ఉపాధ్యాయులుగా వారి సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఎస్‌టియు రాష్ట్ర అసోసియేటర్ అధ్యక్షుడు గంటా మోహన్, జిల్లా శాఖ అధ్యక్షులు మదన్ మోహన్ రెడ్డి, హెచ్‌ఎం అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రవీంద్రనాథ్ రెడ్డి, కనకాచారి, అమర్నాథ్ రెడ్డి శివప్రసాద్, సురేష్ రెడ్డి, తులసి ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు అర్హులైన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఓ పురుషోత్తం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పచ్చికాపల్లం, వెదురుకుప్పం, దేవలంపేట ఇండియన్ బ్యాంక్ శాఖలకు సంబంధించి మొత్తం 28 రుణాలు మంజూరు చేయుటకు అవకాశం ఉందని, ప్రజలు ఓబిఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకుని, దరఖాస్తు ఫారమ్, ఆధార్, రేషన్ కార్డ్, కులం, ఆదాయం, బ్యాంక్ పాస్‌బుక్, విద్యార్హత ధృవీకరణ పత్రం జిరాక్స్‌లతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫోటో కలిపి మొత్తం 3 సెట్లు జిరాక్స్‌లను మీ సచివాలయంలోని సంక్షేమం, విద్యా సహాయకుల వద్దకు చేర్చాలని తెలిపారు.

100 శాతం ఉత్తీర్ణతకు కేరాఫ్ 'అగస్తి'



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఆగస్తి పాఠశాల 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా గురువారం చెక్‌పోస్టు కూడలిలో భారీ కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ మొగాల శోభ, ఛైర్మన్ మొగసాల రెడ్డప్ప మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు. ఈసందర్భంగా మొదటి, రెండో, మూడో స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సత్తాచాటిన శ్రీహరి పురం విద్యార్థులు



ప్రజాశక్తి- విజయపురం: పదవ తరగతి ఫలితాలలో విజయపురం మండలం శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 89 శాతం ఫలితాలు సాధించి మండలంలో అగ్రస్థానం లో నిలిచింది. 28 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 25 మంది విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు శ్యామల, హరిప్రసాద్ వర్మ ఉపాధ్యాయులు విజయచంద్రిక, సునీత, రాధాకుమారి, వెంకటేష్, వియయకుమార్, గోపి, విజయవర్మ వెంకమరాజు, లక్ష్మిపతిలను అభినందించారు.

బృందావనంను పరిశీలించిన ఈఓఆర్‌డి

ప్రజాశక్తి- సోమల: మండలంలోని ఇరికిపెంట వద్ద ఎస్‌డబ్ల్యూపిసి (బృందావనం) చెత్త నుండి సంపద కేంద్రంలో వానపాముల ద్వారా ఎరువులను తయారు చేయడం విధానాన్ని ఈవోఆర్డీ లక్ష్మీదేవి గురువారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీలకు సంపద సృష్టించేందుకు ప్రభుత్వం ప్రజల నుండి సేకరించిన తడి పొడి చెత్తను వేరు చేసి వాటిని చెత్త నుండి సంపద కేంద్రానికి తరలించి అక్కడి తొట్టెల్లో చెత్తను నింపి వానపాములను వదిలి ఎరువులను తయారు చేయడం ఆపై ఆ ఎరువులను సరసమైన ధరకు రైతులకు అమ్మి పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవడం జరుగుతుందని దీనిని నిరంతరం కొనసాగించేలా పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకోవాలని కోరారు. సర్పంచ్ రెడ్డప్ప పంచాయతీ కార్యదర్శి మేనక, సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

వైభవంగా మహాభారత ధ్వజారోహణం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలో వార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని బుధవారం శ్రీకృష్ణ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయం వద్ద ధ్వజారోహణ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభించారు. ముందుగా ఆలయం శుద్ధిచేసి, చలువ పందిళు ,, విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. అమ్మవారు, పంచ పాండవుల మూలవిరాట్ ఉత్సవమూర్తులకు అభిషేకాలు, పట్టు వస్త్రాలు, ఆభరణాలు పూలతో అలంకరించి పురోహితులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పూజలు చేపట్టారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజారోహణతో మహాభారత యజ్ఞం ప్రారంభించారు. కార్యక్రమంకు ఉభయ దాతలుగా సౌజన్య జయప్రసాద్ రెడ్డి, రాజేశ్వరి పద్మనాభరెడ్డి, శ్రీదేవి ఢిల్లీ ప్రసాద్‌రెడ్డిలు వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త రాధాకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మహాభారత ఉత్సవాల ఆహ్వానం

మండలంలోని చవటగుంట మహాభారత ఉత్సవాలకు ప్రభుత్వ విప్, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్‌ను ఆహ్వానించినట్లు ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణ రెడ్డి తెలిపారు. గురువారం వారి స్వగృహంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందించి ఉత్సవాలను ఆహ్వానించినట్లు తెలిపారు. వారి వెంట బి.సభాపతి రెడ్డి, హరినాథరెడ్డి, నరసింహా రెడ్డి, మోహన్ మురళి, హనుమంతరెడ్డి, జయరామయ్య ఉన్నారు.

పంచాయతీ రాజ్ వ్యవస్థతోనే గ్రామీణాభివృద్ధి



ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడిన తర్వాతే గ్రామాల అభివృద్ధి జరిగిందని ఎంపీపీ అనిత, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి అన్నారు. గంగాధర నెల్లూరు ఎంపిడీఓ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు అధికారులు ఘనంగా నివాళులు అర్పించారు. పాలనావ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా గ్రామీణాభివృద్ధి, సామాజిక సాధికారత సాధ్యం అవుతుందన్నారు. వైస్ ఎంపీపీ హరిబాబు, టిడిపి మండల అధ్యక్షుడు స్వామిదాస్, ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాసులు, వెలుగు ఏపీఎం ఫరీద్ మస్తాన్, బుక్కాపట్నం, వేపంజేరి సర్పంచ్‌లు మునిరాజారెడ్డి, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.


ఎస్ఆర్ పురం: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని మండల అధ్యక్షులు, ఎంపిటీసీ మెంబర్లు ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిటీసీ మెంబర్లు సర్పంచులు, ఎంపీడీవో మోహన మురళి, విస్తరణాధికారి కోదండరామిరెడ్డి, ఏపీఎం రోజా, ఏపీఓ లలిత, కుమార్, ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో పురుషోత్తం ఆధ్వర్యంలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా బిఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సూపరింటెండెంట్ నాగమణి, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.


రామకుప్పం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పంచాయతీ అధికారులకు టిడిపి నేతలు గురువారం ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారి సుబ్బయ్య, ఎంపీడీవో మురళీధర్ రెడ్డి, సిబ్బందిని దుశ్యాలవ కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకశ్రద్ధ చూపి మౌలిక సదుపాయాలకు సహకరించినందుకు అభినందించారు. ఆంజనేయ రెడ్డి, సీతాపతి, రామకృష్ణప్ప, సుబ్రీ ,రాజసింహ, బాలరాజు ,అల్లి శీన, ఆంజనేయప్ప, మురళి, భాస్కర్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ అధికారి సుధాకర్ రావు పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతులు మీదుగా గురువారం అవార్డు అందుకున్నారు. ఆయన ఒకప్పుడు వెదురుకుప్పం ఎంపీడీవో, ఆయన చేసిన సేవలకు పలువురు అభినందనలు తెలిపారు.

బంగారుపాళ్యం: పంచాయతీరాజ్ వ్యవస్థతోనే గ్రామాల అభివృద్ధిని సర్పంచ్ ఉమాదేవి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శులు యుగంధర్, అవంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంచార్జ్ ఈఓపిఆర్‌డి గణపతి మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా జరిగిందన్నారు. మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి ఆయుష జిలేక, కవిత, భాస్కర్ పాల్గొన్నారు.



రామకుప్పంలో..



ఎస్ఆర్.పురంలో..

విజయపురం: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకల్లో మండల వైస్ ఎంపీపీ మంజు బాలాజీ, వెటర్నరీ డాక్టర్ శివమూర్తి జూనియర్ అసిస్టెంట్ రఘు పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ మాటాడుతూ గ్రామాలను అభివృద్ధి చేయుటకు అధికారులు గ్రామస్థాయిలో పంచాయతీలు కల్పించారని, ఇందులో భాగస్వామ్యములైన అన్ని శాఖల ఉద్యోగుల కన్నా పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని తెలపారు. ఈ సందర్భంగా కొంతమంది సర్పంచులను, ఉద్యోగులను సన్మానించారు.

సోమల: మండలంలోని కందూరు ఆవులపల్లి సోమల ఇరికిపెంట పంచాయతీలలో జాతీయ పంచాయతీ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సచివాలయాలలో అంబేద్కర్ గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించి అనంతరం పంచాయతీ వ్యవస్థ గ్రామ స్వరాజ్యం తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. ఎంపీపీ ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శులు మేనక, జయశంకర్, మణికుమార్, ఆనంద్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగునీటి కాలువ పనులు పరిశీలన

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని పెద్దతయ్యూరు గ్రామంలో ప్రజల సౌఖ్యరార్థం ఎమ్మెల్యే చొరవతో ఎంపీ నిధుల ద్వారా స్థానిక టిడిపి నాయకులు నాగరాజు ఆధ్వర్యంలో డ్రైనేజ్ కాలువ నిర్మాణం చేపట్టారు. గ్రామంలో మురుగు నీరు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ డ్రైనేజ్ కాలువ నిర్మాణ పనులకు ఎంపీ నిధులతో ఏర్పాటు చేశారు. గురువారం డ్రైనేజ్ పనులను ఆర్డబ్ల్యూఎస్ డీఈ సతీష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సునీల్ పనుల నాణ్యతను పరిశీలించి పనులను త్వరగా పూర్తిచేయాలని తెలిపారు.

గంగజాతరకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని పత్తికొండలో వైభవంగా నిర్వహించనున్న శ్రీపెద్దపులి గంగమ్మ జాతరకు విచ్చేయాలని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని గ్రామస్తులు గురువారం ఆహ్వానించారు. ఏటా వైభవంగా జరగనున్న ఈ పండుగను ఈనెల 29న అమ్మవారి శిరస్సు మెరవణి, 30 జాతర, మే 1న అమ్మవారి జలది నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, హరిబాబు, రంగప్ప, పార్థీష్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

మిస్టర్ ఇండియా ఫ్రాన్స్‌ను అభినందించిన ఎమ్మెల్యే



ప్రజాశక్తి- పలమనేరు: మిస్టర్ ఇండియా ఫ్రాన్స్ -2025 విజేతను పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి అభినందించారు. పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను పారిస్‌కు చెందిన మిస్టర్ ఇండియా ఫ్రాన్స్ -2025 విజేత ఎం.జ్ఞాకరణ్ శ్రీకరణ్ గురువారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 5వ తేదీన జ్ఞాకరణ్ శ్రీకరణ్ పారిస్‌లో జరిగిన పోటీల్లో మిస్టర్ ఇండియా ఫ్రాన్స్‌గా బరిలో నిలిచి వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరచి విజేతగా రాణించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అతన్ని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సహకార సంఘసేవలపై అవగాహన

ప్రజాశక్తి- యాదమరి: యాదమరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సేవలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. మండల స్థాయిలోని సహకార సంఘాలు బలోపేతం కావాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పిఐసి సులోచన అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. యాదమరి సహకార సంఘం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గుణశేఖర్ మాట్లాడుతూ సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించాలని కోరారు. సహకార సంఘంలో అన్ని రకాల సేవలు ఆన్లైన్లోనే కొనసాగుతుందని, సహకార సంఘం పరిధిలో ఎరువులు క్రయవిక్రయాలు ప్రారంభిస్తామని తెలియజేశారు. సహకార సంఘం రైతులకు కొత్త రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. సహకార సంఘం పరిధిలోని ప్రతి రైతు ఈసేవలను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఈఓ గుణిశేఖర్, డిసిసి బ్యాంక్ సూపర్వైజర్ ధనంజయ రెడ్డి, ఏడీఏ ఉమా, వ్యవసాయ అధికారి చరిత, రైతులు పాల్గొన్నారు.

సంఘాల బలోపేతమే లక్ష్యం

డిసిసిబి అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రసాద్

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: సహారా సంఘాలను చేయడమే లక్ష్యంగా రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేస్తామని డిసిసిబి రిజిస్ట్రర్ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సహకార సంఘాలలో రైతుల అవగాహన సదస్సును మండల కేంద్రమైన ఎస్ఆర్ పురం డిసిసిబిలో సహకార సంఘాల రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. పిఎసిఎస్ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో సహకార కేంద్రం బ్యాంక్‌లో భూములు కలిగిన ప్రతి రైతు సహకార సంఘాలలో రుణాలు తీసుకోవడానికి ముందుకు రావాలన్నారు మండల వ్యవసాయ అధికారి నర్మదా మాట్లాడుతూ సహకార సంఘంలో అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచి అందజేస్తామన్నారు మిగిలిన రైతులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిసిసి బ్యాంక్ సీఈఓ రాజారెడ్డి, రమణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చెయ్యొద్దు: ఎస్పీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి- గుడిపాల: ప్రజల నమ్మకాన్ని ఎల్లప్పుడూ వమ్ము చేయొద్దని చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. గుడిపాల పోలీస్ స్టేషన్‌ను గురువారం ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గుడిపాల పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సమీక్షించారు. ఈ స్టేషన్ అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న పోలీస్ స్టేషన్ కనుక జాతీయ రహదారిపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండడం చాలా అవసరమన్నారు. నిత్యం భారీ వాహనాల రాకపోకలు, అక్రమ రవాణా, మాదకద్రవ్యాల అక్రమ చలామణి వంటి వాటిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ రామ్మోహన్‌ను ఆదేశించారు. సరిహద్దు ప్రాంతమైనందున ఇతర రాష్ట్రాల నుండి వచ్చే వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టడం, అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేయడం, నేరాల రహదారి మార్గాన్ని ముందుగానే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన 14 సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సర్కిల్ పరిధిలో తీసుకున్న చర్యలను సమీక్షించారు. బ్లాక్ స్పాట్స్ సందర్శించి రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు తనిఖీ చేస్తూ పలు కేసులలో స్వాధీ నం చేసుకున్న వాహనాల వివరాలు తెలుసుకున్నారు. మహిళా పోలీసులను వినియోగించి గ్రామాలలోని ప్రతి ఇంటికి వెళ్లి, మహిళలపై నేరాలు జరిగే అవకాశం ఉన్న సమాచారాన్ని సేకరించాలనీ, శక్తి యాప్ ప్రాధాన్యతను వివరించి ప్రతి మహిళా మొబైల్‌లో ఆ యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేయించాలనీ, అదేవిధంగా ఫోక్సో చట్టం, మోసాలు (ఛీటింగ్), సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి రోజు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుగా గుర్తొచ్చేది పోలీసులు అని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు సహాయం చేయాలన్నారు. అనంతరం ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని, డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జమ్మూ కాశ్మీర్‌లో మారణకాండకు నిరసనగా

కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఆర్టీసీ బస్టాండ్ పక్కన గల రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జమ్మూ కాశ్మీర్లోని పహల్గాం ఘటనను నిరసిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. సీనియర్ క్లబ్ సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పహల్గంలో జరిగిన సంఘటన చాలా సిగ్గుచేటని, టూరిస్టుల బట్టల విప్పి హిందువులని నిర్ధారించుకుని క్రూరంగా చంపడం చాలా బాధాకరమని, దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈకార్యక్రమంలో దాదాపు 100 మంది రిక్రియేషన్ క్లబ్బు సభ్యులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు.



పలమనేరులో..



చౌడేపల్లిలో..

చౌడేపల్లి: ఉగ్రదాడిని నిరసిస్తూ కూటమి పార్టీలు జనసేన టిడిపి బిజెపిల ఆధ్వర్యంలో కొవ్వుతల ర్యాలీ నిర్వహించారు. దాడిలో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. కూటమి నాయకులు పిల్లారి జీవన్, ప్రకాష్, కార్తీక్, హరి రాయల్, విద్యాసాగర్ నాయుడు, సాయికిరణ్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం: జమ్మూ కాశ్మీర్లో అందాలు చూడడానికి వెళ్లిన యాత్రికులపై, విచక్షణ రహితంగా ఉగ్రమూకలు దాడి చేశారని, దీనిని నిరసిస్తూ గురువారం శ్రీలక్ష్మీ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ అధినేత ప్రసాద్ తమ సిబ్బందితో కలిసి పురవీధులలో కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. ఇలాంటి సంఘటన మరలా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న బీసీఎన్ చారిటబుల్ ట్రస్ట్

ప్రజాశక్తి- కుప్పం టౌన్

గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించడంలో బీసీఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఇప్పుడు ముందుంటుంది. చారిటబుల్ ట్రస్ట్ తరపున తరచూ పలువురు క్రీడాకారులకు, ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు, వసతి గృహ విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించడంతో పాటు ముఖ్యంగా క్రీడాకారులకు క్రీడా సామాగ్రిని, ఏకరూప దుస్తులను అందించడం జరుగుతూనే ఉంది. ఇందులో భాగంగా అంతర్ జిల్లా సబ్ జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందించారు. అనంతరం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు మాట్లాడుతూ ద్రవిడ కూడలిలోని కుప్పం నియోజకవర్గంలో పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి బిసిఎన్ విద్యాసంస్థలను స్థాపించడం జరిగిందన్నారు. ఈ స్ఫూర్తితోనే బిసిఎన్ చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభించి పేదలకు సేవ చేస్తున్నట్టు తెలిపారు. ట్రస్ట్ తరపున విద్యార్థులకు ఆర్థికసాయం అందించడం, క్రీడాకారులను ప్రోత్సహించడం, పేద ప్రజలను ఆదుకోవడం వంటి పలు సేవా కార్యక్రమాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఛైర్మన్ మహేష్ మాట్లాడుతూ క్రీడల అభ్యున్నతికి సహకరిస్తున్న బిసిఎన్ విద్యాసంస్థల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్, శరవణన్, పిఆర్ఓ ప్రవీణ్, పీఈటీ వేణు, ఎస్ఎస్ కోఆర్డినేటర్ గంగాధర్, లియో క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్, శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రారంభించిన శక్తి యాప్ అత్యవసర సమయంలో ఎంతో ఉపయోగపడుతుందని మహిళా ఎస్ఐ నాగసౌజన్య వివరించారు. శక్తి టీం నోడల్ అధికారి అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్, ఇంచార్జ్ అడ్మిన్ ఎస్ఆర్.రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో గురువారం సిఆర్ఆర్ పాఠశాలలో మహిళా ఎస్ఐ విద్యార్థులకు శక్తి యాప్, గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతీ యువతి, మహిళా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం చాలా అవసరమని, అత్యవసర సమయంలో ఇది మన రక్షణకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని మన భద్రత మన చేతుల్లోనే ఉందని అన్నారు. అనంతరం గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, అసహజ స్పర్శలు ఎదురైతే 'నో' చెప్పడం, పెద్దలకు చెప్పడం, 1098 చైల్డ్ లైన్‌కు కాల్ చేయడం వంటి చర్యలపై కూడా మార్గనిర్దేశం చేశారు.

క్రైం న్యూస్

అనుమానాదస్పద స్థితిలో

మహిళా కానిస్టేబుల్ మృతి

పోలీసు లాంఛనాలతో దహనక్రియలు

ప్రజాశక్తి- చౌడేపల్లి:



మృతురాలు లక్ష్మీ (ఫైల్‌ఫోటో)

అనుమానాస్పద స్థితిలో మహిళా కానిస్టేబుల్ ఉరేసుకుని మృతి చెందిన సంఘటన చౌడేపల్లి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చౌడేపల్లి పరిధిలోని గోసలకురపల్లికి చెందిన లక్ష్మీ (33) కుప్పం నియోజకవర్గం గుడిపల్లి పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈనెల 23న రాత్రి స్వగ్రామం గోసులకురపల్లికి వచ్చింది, ఇంట్లో అందరూ భోజనం చేస్తుండగా కొద్దిపాటి గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన లక్ష్మీ గదిలోకి వెళ్లి ఉరేసుకుని కుటుంబ సభ్యుల కంటపడింది వెంటనే వారు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అందరితో స్నేహభావంతో ఉండే లక్ష్మీ మృతిచెందడంతో పోలీసులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. సిఐ రాంభూపాల్, ఎస్ఐ నాగేశ్వరరావు మహిళా కానిస్టేబుళ్ల సిబ్బంది లక్ష్మి మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం లక్ష్మి మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. గురువారం లక్ష్మీ దహనక్రియలను స్వగ్రామంలో అధికార లాంఛనాలతో నిర్వహించారు.

వైసిపి సర్పంచ్‌పై దాడి

ప్రజాశక్తి - విజయపురం:



మండలంలోని ఎం.అగరం గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుధాకర్‌పై టిడిపికి చెందిన నాయకులు లోకయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్ దాడి చేశారు. టిడిపి నేతలకు అనుకూలంగా పంచాయితీ తీర్మానం చేయలేదని సర్పంచ్ సుధాకర్‌పై కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బాధితుడు సుధాకర్ మాట్లాడుతూ తాను ఇంట్లో ఉండగా తనపై కత్తులు, కటార్లు పట్టుకుని వచ్చి దాడి చేశారని తెలిపారు. పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులను వాళ్లకు అనుకూలంగా రిజల్యూషన్ ఇవ్వలేదని టీడీపీ నాయకులు మోహన్, లోకయ్య దాడి చేశారని ఆరోపించారు. తీవ్రంగా గాయపడటంతో విజయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం వెళ్లడం జరిగిందని, అక్కడ వైద్యులు మెరుగైన చికిత్స కోసం నగిరి ఏరియా హాస్పిటల్‌కి అంబులెన్స్ సహాయంతో తరలించడం జరిగిందన్నారు. నగిరి ఏరియా హాస్పిటల్‌లో వైద్యులు పరిశీలించి ముక్కులో ఉన్న ఎముక విరిగిందని మెరుగైన వైద్యం కోసం తిరుపతి వెళ్లాలని రెఫర్ చేయడంతో అక్కడి నుంచి తిరుపతికి వెళ్లడం జరిగిందన్నారు. వైసిపి నాయకులపై వరుస దాడులకు పాల్పడుతున్నారని ఈ దాడిని ఖండిస్తున్నామని మాజీ మంత్రి రోజా తెలిపారు. విజయపురం మండలంలో ఏం అగరంలో టిడిపి నాయకుల రెచ్చిపోతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఆర్టీసీ బస్టాండులో బంగారు గొలుసు దొంగతనం కలకలం రేపింది. గురువారం సాయంత్రం కొండామర్రికి చెందిన శిరీష బెంగళూరు నుంచి వస్తూ ఇంటికి వెళ్లడానికి పలమనేరు- చౌడేపల్లె బస్సు ఎక్కారు. కొంత సమయానికి తన రూ.2వేల నోట్ పోయిందంటూ బస్ స్టార్ట్ కాకముందే మరో మహిళ దిగేశారు. ఇదే సమయంలో శిరీష తన బ్యాగులోని వస్తువులు చెక్ చేసుకోగా 12 గ్రాముల బంగారం చైన్ కనపడలేదు. వెంటనే పోలీసులను పిలిపించి ప్రయాణికులను చెక్ చేసినా ఫలితం లేకుండా పోయింది.

ఘర్షణకు దారితీసిన తాగునీటి గొడవ





ప్రజాశక్తి- బంగారుపాళ్యం : తాగునీటి తగాద తీవ్ర ఘర్షణకు దారి తీసిందని ఎస్సై ప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని కట్టప్పగారిపల్లి పంచాయతీ ఎద్దులవారిపల్లి దళితవాడలో తాగునీటి కోసం జరిగిన చిన్నపాటి గొడవ జరిగింది. గ్రామంలోని పంచాయతీ నీటి కొళాయిల్లో ఒకవైపు వీధిలో ఒకరోజు, మరోవైపు వీధిలో మరోరోజు గ్రామస్తులు నీటిని పట్లుకుని వాడుకుంటూ ఉంటారు. పక్క వీధిలో వాళ్లకు రెండు రోజులు నీళ్లు రానందున గోవిందస్వామి కుమారుడు రంజిత్ కుమార్ బుధవారం సాయంత్రం గేటు వాల్ తిప్పి నీళ్లు పట్టుకున్నారు. ఆ విషయంగా అదే గ్రామానికి చెందిన శ్రావణ్ కుమార్, రంజిత్ కుమార్ తెలుసుకుని గేటు వాల్ ఎందుకు తిప్పావని అడిగారు. ఈవిషయంగా బుధవారం ఇరువురు తిట్టుకున్నారు. గురువారం ఉదయం గోవిందస్వామి బంధువులకు అలాగే శ్రవణ్ కుమార్ బంధువులకు ఇరువురికి కొళాయి విషయంగా మళ్లీ ఘర్షణలు పడ్డారు. ఇరు కుటుంబాల వారు ఒకరిపై ఒకరు ఘర్షణకు దిగి గాయాలపాలయ్యారు. దీంతో స్థానికులు వారిని బంగారుపాళ్యం ప్రభుత్వాసుపత్రికి చేర్చి చికిత్స అందించారు. అనంతరం పోలీస్ స్టేషన్లో ఇరు కుటుంబాల వారు ఫిర్యాదు చేయడం జరిగింది. శ్రావణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోవిందస్వామి అతని భార్య నాగరాజమ్మ, వారి కుమారుడు రంజిత్ కుమార్, వారి బంధువు శివయ్య, చిలకమ్మలపై కేసు నమోదు చేయడమైనది. అలాగే గోవిందస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రావణ్ కుమార్ అతని భార్య స్వాతి, వారి బంధు సరితలపై రెండు కేసులు నమోదు చేసి రెండు కేసులను దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పుష్ప పల్లకిలో ఊరేగిన స్వయంభేశ్వర స్వామి

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలోని శ్రీ స్వయంబేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం మొదటి ఉదయం పగలు నిర్వహించగా రాత్రి స్వామివారి ఊరేగింపు శ్రీ దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త భక్తులు నిర్వహించారు. ఉదయం మొదటి ఉదయంలో భాగంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించి అభిషేకం చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం త్రిశూలం ఊరేగింపు నిర్వహించి అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పుష్ప పల్లకిలో పురవీధులలో ఊరేగించారు. దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్టను చేశారు. పుష్ప పల్లకి వెంట కోలాటాలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.